పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నస్పూర్, జూన్ 11 : మంచిర్యాల జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 79 మంది విద్యార్థులకు 56 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టీ), జూన్ 11 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

నస్పూర్, జూన్ 11 : ఇటీవల ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించిందని కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని విద్యార్థి సంఘాల నాయకులు అక్షయ్‌కుమార్, పూదరి శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యాభివృద్ధి కుంటు పడుతుందన్నారు. అనేక కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వక కౌన్సెలింగ్ సెంటర్ల వద్ద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలన్నారు. నాయకులు మల్లికార్జున్, భూమేశ్, రాజేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

19న తైబజార్ వేలం

సీసీసీ నస్పూర్, జూన్ 11 : నస్పూర్ మున్సిపాలిటీలో ఈ నెల 19వ తేదీన మేకల మార్కెట్, తైబజార్ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను తీగల్‌పహాడ్ యాదవ నగర్‌లో గల మేకల మార్కెట్‌తో పాటు మున్సిపల్ పరిధిలోని వారసంతలు, రోడ్ల వెంట వ్యాపారం చేసే వారి నుంచి తైబజార్ రుసుము వసూళ్ల కోసం బహిరంగ వేలాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 13 నుంచి 15వ తేదీలోగా ప్రతి వేలంకు రూ.50వేలు కమిషనర్ నస్పూర్ మున్సిపాలిటీ పేరు మీద బ్యాంకులో డీడీలు తీసి కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో తెలుసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా పెరిగిన విద్యుత్ బిల్లుల చెల్లింపులు

మంచిర్యాలటౌన్, జూన్ 11: ఎన్‌పీడీసీఎల్ మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు గణనీయంగా పెరిగాయని విద్యుత్ శాఖ మంచిర్యాల సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మే నెలలో 50,937 మంది విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ. 864.92 లక్షలు చెల్లించారని, ప్రతి నెల ఆన్‌లైన్ చెల్లింపులు 20 శాతం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ www. tgnpdcl.com, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా విద్యుత్ వినియోగదారులు నెలవారి బిల్లులు చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. లైన్లలో నిలబడి బిల్లులు చెల్లించడం కంటే కేవలం రెండు నిమిషాల్లోనే ఇంట్లో నుంచే యూఎస్‌సీ నంబర్‌ను నమోదు చేసి బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఇప్పుడు బిల్లుల పైనే క్యూఆర్ కోడ్ ముద్రించడం జరుగుతుందని, మొదట ప్రయోగాత్మకంగా వరంగల్‌లోని మట్టెవాడలో ప్రారంభించడం జరిగిందని, త్వరలోనే మంచిర్యాలలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. దీంతో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే మీ బిల్లులకు సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయని, మరింత సులభంగా బిల్లులు చెల్లించవచ్చని అన్నారు.

కొనసాగుతున్న బడిబాట

కోటపల్లి, జూన్ 11 : కోటపల్లి మండలంలో బడిబాట కొనసాగుతుంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ బడీడు పిల్లల వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పైన మంగళవారం పాఠశాలలో సమావేశాలు నిర్వహించారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత

వెంకటకృష్ణ తల్లి ప్రమీలకు నగదు అందజేస్తున్న మిత్రులు

హాజీపూర్, జూలై 11 : దొనబండ గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకటకృష్ణ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు విరాళాలు సేకరించి మొత్తం రూ.28 వేలు కృష్ణ తల్లి ప్రమీలకు మంగళవారం అందజేశారు. చిన్ననాటి మిత్రులు తోటి మిత్రుని కుంటుంబానికి చేయూతను అందజేయడంతో గ్రామ ప్రజలు వారిని అభినందించారు.

నర్సరీల పరిశీలన

వేమనపల్లి, జూన్ 11 : మండలంలోని గొర్లపల్లి, దస్నాపూర్, వేమనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను మంగళవారం అంబుడ్స్‌మెన్ శివరామ్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్ పరిశీలించారు. హరితహారం కోసం మొక్కలు సిద్ధం చేయాలని, మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని సూచించారు. అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. వారి వెంట ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు కృష్ణమోహన్, శ్రీనివాస్, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కిష్టాపూర్ విద్యార్థికి ప్రతిభ అవార్డు

విద్యార్థి రాథోడ్ ఈశ్వర్‌కు ప్రతిభ అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జన్నారం, జూన్ 11 : కిష్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన రాథోడ్ ఈశ్వర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రవీంద్రభారతిలో ప్రతిభ అవార్డును అందజేసి సత్కరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, విద్యార్థి తండ్రి సంజీవ్‌కుమార్‌ను సత్కరించగా, పాఠశాల ఉపాధ్యాయుడు దముక కమలాకర్ సీఎంతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ అవార్డు పొందిన విద్యార్థిని జిల్లా విద్యాధికారి యాదయ్య, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, గుండ రాజన్న అభినందించారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పర్యటించనున్నారని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45 గంటలకు ఆసిఫాబాద్ మండలం అప్పేపల్లి హైలెవెల్ బ్రిడ్జి సందర్శించి, 10.40 గంటలకు వడాయిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతారని తెలిపారు. 11.55 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారని, మధ్యాహ్నం 3.15 గంటలకు వాంకిడి మండలం సవాతి గ్రామ ప్రజలతో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పశువుల కొట్టాలు కావు.. ప్రభుత్వ కార్యాలయాలే

తహసీల్ కార్యాలయం ఎదుట బురదలో మేస్తున్న పశువులు

నెన్నెల, జూన్ 11 : నెన్నెలలోని ఎంపీడీవో, తహసీల్, ఏడీఏ, ఎస్సీ బాయ్స్ హాస్టల్, పీహెచ్‌సీ, మండల వనరుల కేంద్రం , ఐకేపీ కార్యాలయాలు ఒక దాని పక్కన మరొకటి ఉన్నాయి. నిత్యం ఆయా కార్యాలయాలకు పలు గ్రామాల నుంచి పనుల నిమిత్తం ప్రజలు, జిల్లా అధికారులు వస్తుంటారు. తహసీల్ కార్యాలయం ముందు బురద నీటి గుంట ఉండడం వల్ల అక్కడికి పశువులు తాగునీటికి మేతకు వచ్చి పక్కనే రోడ్డుపై ఉన్న చెట్ల కింద సేద తీరుతాయి. నిత్యం వచ్చి పోయే పశువులతో కొంత ఆటంకం ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ఏ కార్యాలయం ముందు ఫెన్సింగ్ , గోడ కాని లేదు. కనీసం హరితహారంలో నాటిన ఒక మొక్క కూడా కనబడదు.

అధ్వానంగా నర్సరీలు

కన్కిలోని నర్సరీలోని బెడ్‌లలో మొక్కలు లేకుండా ఖాళీగా ఉన్న బ్యాగులు

కౌటాల, జూన్ 11: కౌటల మండలంలోని నర్సరీల్లో మొక్కలు లేక, ఉన్న మొక్కలకు పర్యవేక్షణ లేక అధ్వానంగా తయారయ్యాయి. కేసీఆర్ పాలనలో గ్రామాల్లోని నర్సరీలు పచ్చని మొక్కలతో జూలై మాసంలో నాటేందుకు సిద్ధంగా ఉండేది. కానీ నేడు అదే నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు పర్యవేక్షణ లేక ఆగంఆగం తయారయ్యాయి. కన్కి గ్రామ నర్సరీలో మొలకెత్తిన మొక్కలకు పాచి తీగలు పట్టుకుని పెరగడం ఆగి పోవడంతో పాటు పూల మొక్కల కోసం పెట్టిన బెడ్‌లలో మొక్కలు లేక మట్టి మాత్రమే దర్శనం ఇస్తున్నది. అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనం ఈ నర్సరీ..

విజిత్‌రావు జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, జూన్ 11: బీఆర్ఎస్ యూత్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు జన్మదిన వేడుకలు మంగళవారం మంచిర్యాలలో అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద విజిత్‌రావు కేక్ కట్ చేసి దివాకర్‌రావుకు తినిపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నరేశ్, నాయకులు సుంకరి రమేశ్, శ్రీరాముల మల్లేశ్, తోట తిరుపతి, పడాల రవీందర్, పడాల శ్రీనివాస్, శంకర్, మహ్మద్‌రఫీ, దామోదర్, గంగాధర్, చరణ్‌దాస్, భానుచందర్, శ్రీనివాస్‌రెడ్డి, రియాజ్, రాము, రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

కోటపల్లి: ఎసన్వాయి గ్రామంలో సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

సిర్పూర్(టీ): కర్జపల్లిలో మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టీ), జూన్ 11 : మండలంలోని పారిగాం, కర్జపల్లి, డోర్‌పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శరణ్య, పాహింబాను, సుజాత, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

కోటపల్లి, జూన్ 11 : కోటపల్లి మండలం ఎసన్వాయి గ్రామంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీనాథ్ స్వామి పరిశీలించారు. సర్వే నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి ఎండీ తాజొద్దీన్‌కు సూచించారు.

చింతలమానేపల్లి, జూన్ 11 : బాబాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ సర్వేను ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. సర్వేకు సంబంధించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో తాగునీటి బావుల వద్ద నీళ్లు వృథాగా పోకుండా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

జన్నారం, జూన్ 11 : పొనకల్ గ్రామంలో మిషన్ భగీరథ పథకం అమలుపై ఎంపీడీవో శశికళ ఇంటింటికీ తిరిగి పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఈ పథకం ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఇంటి యజమాని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రాహుల్ ఉన్నారు.

పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి

అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 11 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం ఆడ గ్రామ పంచాయతీ పరిధిలోని వాడిగూడ ప్రాథమిక పాఠశాల, ఈదులవాడ ప్రాథమిక పాఠశాల, వాంకిడి మండలం ఘాట్‌జంగాం, మండోకర్‌వాడ, గోయగాం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మిగిలిన మరమ్మతుల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో షెడ్లు ఏర్పాటు చేయాలి

షెడ్లు లేక ఎండలో, ఫుట్ వే బ్రిడ్జి కింద వేచి ఉన్నా ప్రయాణికులు

కాగజ్‌నగర్, జూన్ 11: కాగజ్‌నగర్‌లోని రైల్వే స్టేషన్ 3వ ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు సరిపడ షెడ్లు ఏర్పాటు చేయాలని డీఐఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, జిల్లా కార్యదర్శి కార్తిక్ డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ 3వ ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన నాలుగు షెడ్లు సరిపోకపోవడంతో ప్రయాణికులు ఫుట్ వే బ్రిడ్జి కింద, చెట్ల కింద రైలు కోసం వేచి చూడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ప్రతి బోగి వద్ద షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా తాగునీటి వసతి లేకపోవడంతో బయట నుంచి మంచి నీరు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని స్పష్టం చేశారు. రైల్వే అధికారులు స్పందించి ప్లాట్‌ఫాంపై షెడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

మందమర్రి, జూన్ 11: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు గణేశ్ నగర్‌లో 20 ఇండ్లకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ అన్నారు. గణేశ్ నగర్‌లో అన్ని ఇండ్లకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ అన్ని వీధుల్లో వేయక పోవడం వల్ల 20 ఇండ్లకు నీరు సరఫరా జరగడం లేదని వారు పేర్కొన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులను, సిబ్బందిని కాలనీకి పంపించి అన్ని ఇండ్లకు మిషన్ భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ సొసైటీ పట్టణ అధ్యక్షుడు నంది పాట రాజు, కార్యదర్శి గాండ్ల సంజీవ్, ఎండీ జావిద్, సాయి, అజయ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీసీసీ నస్పూర్, జూన్ 11: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో చాలా ఏళ్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచాలని కోరారు. ఇక్కడ పెద్దింటి మోహన్, శ్రీపతి సురేశ్, తేలేటి నారాయణ, శ్రీకాంత్, రామకృష్ణ, ప్రశాంత్, సంపత్, గోపి, ఎస్ సతీశ్, వినోద్, తదితరులు ఉన్నారు.

అర్హులకు ప్రమోషన్లు కల్పించాలి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి

రెబ్బెన, జూన్ 11: అర్హులైన ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించడంతో పాటు ఏరియాస్ చెల్లించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి డిమాండ్ చేశారు. గోలేటిటౌన్‌షిప్‌లో గల ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి రీజియన్‌లో జరుగుతున్న ఈపీ ఆపరేటర్ గ్రేడ్ టెస్ట్ ను సీ టూ బీ, బీటూ ఏ ప్రమోషన్లను ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా పడడం జరిగిందన్నారు. కార్మికులు నష్టపోకుండా పాత తేదీ నుంచి ప్రమోషన్లు కల్పించాలని, వేకెన్సీ తో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, కిరణ్‌బాబు, శేషు, దివాకర్, ఖైర్‌గూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకు సాధించిన అర్జున్‌కు సన్మానం

అర్జున్‌ను సన్మానిస్తూ విరాళం అందజేస్తున్న చైర్మన్ గాదె అవినాశ్ సంఘం సభ్యులు

వాంకిడి,జూన్ 11 : వాంకిడికి చెందిన దుర్గం అర్జున్ అనే నిరుపేద విద్యార్థిని లక్ష్మణ సేవ సదన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సన్మానించి ఉన్నత చదువులకు 5100 రూపాయలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా ఎల్ఎస్ఎస్‌డబ్ల్యూఎస్ చైర్మన్ గాదె అవినాశ్ రూ.1100లు, మొత్తం రూ.6200 విరాళంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గాదె అవినాశ్ మాట్లడుతూ ఇటీవల తండ్రి మహేందర్ మృతి చెందడంతో పాటు పేదరికం వెక్కి రించి అధైర్యపడకుండా జేఈఈ పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో1782 ర్యాంకు సాధించడం గొప్ప విషయయని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ సేవ సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజర్, శ్రీ సత్య సాయి సేవ సమితి అధ్యక్షుడు గాదె అనిల్ కుమార్, సంస్థ ఉపాధ్యక్షులు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్, ప్రధాన కార్యదర్శి మాధవి దౌలత్ కుమార్, మార్కెట్ కమిటీ ఆసిఫా బాద్ డైరెక్టర్ రోషన్, ఎల్ఎస్ఎస్‌డబ్ల్యూ సంస్థ సభ్యులు ఎం అరుణ్, మడావి పింకు, ఇంద్ర జిత్, రాకేశ్, సచిన్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో గిరిజన విద్యార్థికి ర్యాంకు

రాజ్‌కుమార్

నెన్నెల, జూన్ 11 : జేఈఈ అడ్వాన్స్-2024 జాతీయ పరీక్షలో నెన్నెలకు చెందిన బానోత్ రాజ్‌కుమార్‌కు జాతీయ స్థాయిలో 1287 ర్యాంకు సాధించారు. గిరిజన కేటగిరిలో ప్రతిభ కనబర్చారు. రాజ్‌కుమార్ నెన్నెలలోని లంబాడీతండాలో ప్రాథమిక విద్యనభ్యసించి మంచిర్యాల గుడిపేటలోని ఎంజేపీలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్ వరంగల్‌లోని గిరిజన సంక్షేమ సైనిక్ పాఠశాలలో పూర్తి చేశారు. అక్కడే కోచింగ్ తీసుకొని జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు రాసి ప్రతిభ కనబర్చారు. రాజ్‌కుమార్‌ను ఆయన తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలు నియంత్రించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 11: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలు, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మంగళవారం డీఈవో పార్శి అశోక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ నాయకులు హరిశ్చంద్రప్రసాద్, విలాస్ తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 11 : బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోతుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మనుకుమార్, సీఆర్టీ తిరుపతి, నాయకులు వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 11 : మహిళా సంఘాల గ్రూపు మహిళలు బ్యాంకు నుంచి వచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ అన్నారు. మంగళవారం రహపల్లి గ్రామంలో మహిళా సంఘాల గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాస్, సత్యనారాయణ, నాయకులు సుంకరి పెంటయ్య, మధుకర్, గణేశ్ పాల్గొన్నారు

పంటల సాగుపై అవగాహన

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వ్యవసాయ శాఖ అధికారులు

లక్సెట్టిపేట, జూన్ 11 : పట్టణంలోని రైతు వేదికలో సేంద్రియ వ్యవసాయం, విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత గల పత్తి పంట సాగు విధానం అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి ప్రముఖ శాస్త్రవేత్తలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్‌లోని వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు అవగాహన

అవగాహన కార్యక్రమానికి హాజరైన అధికారులు, రైతులు

సిర్పూర్(టీ), జూన్ 11 : పత్తి విత్తనాల సాగుపై శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులు పాటించాలని కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కాగజ్‌నగర్ డివిజన్ వ్యవసాయాధికారులు, రైతులకు దృశ్య మాధ్యమం ద్వారా శాస్త్రవేత్తలు పలు సలహాలు, సూచనలు చేశారు. సేంద్రియ పద్ధతుల ద్వారా ఫార్మింగ్, ఎక్కువ మోతాదులో పత్తి విత్తనాలు వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సిర్పూర్(టీ), కౌటల, కాగజ్‌నగర్ ఏవోలు మధులత, రాజేశ్, రామకృష్ణ, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి



మమతను సన్మానిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు మల్లయ్యబట్టు

తాండూర్, జూన్ 11 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు మల్లయ్యబట్టు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థిని దుర్గం మమత ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ సంచాలకుడు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేశ్, జేడీ రాజీవ్, కేజీబీవీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ హజారి శిరీష, తాండూర్ కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సుమన చైతన్య, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పై అవగాహన



మాట్లాడుతున్న గోనె శ్యాంసుందర్ రావు

హాజీపూర్, జూలై 11 : మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సలహాదారుడు గోనె శ్యాం సుందర్ రావు హాజరై మాట్లాడారు. రైతులందరూ తమ అవసరాల నిమిత్తం 10 నుంచి 20 గుంటల వరకు సేంద్రియ వ్యవసాయంతో వరి పంట, ఇంటి అవసరాల కోసం కూరగాయలు, ఆకు కూరలను సాగు చేసుకోవాలన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు బొడ్డు శంకర్ తన వ్యవసాయ క్షేత్రం నుంచి ఆవు పేడ, ఆవు మూత్రాన్ని అందిస్తానని తెలిపారు. రైతులు పండించిన పంటను ఎఫ్‌పీసీ ద్వారా కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.